72 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు
■ లోపలి పేజీలో..

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 16 నవంబరు 2025

సిల్వర్ షాక్ !

నరసాపురానికి చెందిన ఓ వ్యాపారి రెండు నెలల క్రితం వెండి పెరుగుదల చూసి కేజీ రూ.1.50 లక్షల చొప్పున ఐదు కేజీలు కొనుగోలు చేశాడు. ధర రూ.1.85 లక్షలకు వెళ్లినా అమ్మలేదు. ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఎదురు చూశాడు. ఒక్కసారిగా ధర తిరోగమనం పట్టింది. వారం క్రితం కేజీ రూ.1.45 లక్షలకు దిగింది. ఇంకా పడిపోతుం దన్న భయంతో కొన్న వెండిలో మూడు కేజీలు అమ్మేసుకున్నాడు.

మార్టేరుకు చెందిన ఓ వ్యాపారి సిల్వర్‌లో భారీగా పెట్టుబడులు పెట్టాడు. రియల్‌ఎస్టేట్ కుదేలవడం, బ్యాంకు వడ్డీలు తక్కువగా ఉండటం, స్టాక్ మార్కెట్‌లు ఆశించిన స్థాయిలో లాభాలు ఇవ్వకపోవడంతో వెండి సరైన పెట్టుబడి అని భావించాడు. రానున్న రోజుల్లో భారీగా పెరుగుతుందన్న అంచనాతో 20 కేజీల వరకు కొనుగోలు చేశాడు. మారిన అంతర్జాతీయ పరిణామాలతో ధర తగ్గుముఖం పట్టింది. దీంతో మళ్లీ రూ.లక్షకు దిగుతుందన్న భయంతో కొన్న వెండిని అయినకాడికి అమ్ముకున్నాడు.





- వెండిపై పెట్టుబడులతో నష్టాలు
- పెరుగుదల చూసి భారీగా కొనుగోళ్లు
- గడిచిన రెండు నెలల్లో రూ.20 కోట్లపైనే మదుపు
- ధర పతనంతో వరుస అమ్మకాలు

నరసాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గడిచిన 20 రోజుల నుంచి జిల్లాలో బులియన్ మార్కెట్ వెండి కొనుగోలు కన్నా అమ్మకాలే ఎక్కువగా ఉన్నాయ నేందుకు పై ఉదాహరణలే నిదర్శనం. ఇందులో లాభం గడించిన వారి సంఖ్య స్వల్పంగా ఉంటే నష్టపోయిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. 2008, 2012 సంవత్సరాల్లో వెండి ఊహించని విధంగా పెరిగింది. అప్పటి వరకు కేజీ రూ.30 లేదా రూ.35 వేల మధ్య ఊగిసలాడేది. 2008లో ఒక్కసారిగా పెరుగుతూ వచ్చి రూ.79 వేలకు చేరువైంది. 2012లోనూ రూ.80 వేలకు వెళ్లింది. ఆ తరువాత రూ.40 వేలకు పడిపోయింది. చాలాకాలం రూ.40 వేలు రూ.50 వేల మధ్యే ఊగిసలాడింది. 2021లో రూ.లక్షకు చేరి చాలాకాలం స్థిరంగా ఉండిపోయింది. ఆ సమయాల్లో వెండి ధర ఇంకా పెరుగుతుందన్న భావించి పెట్టుబడులు పెట్టిన వారంతా నిండా మునిగారు. ఈ ఏడాది ఇదే పరిస్థితి కనిపించింది. 2025 ఆగస్టు నుంచి మొదలైన పెరుగుదల అక్టోబరు రెండో వారం వరకు కొనసాగింది. ఒక సమయంలో కిలో రూ.1.75 లక్షలు ఉంటే బ్లాక్‌లో రూ.1.90 లక్షలు పలికింది. ఇదే సమయంలో విశ్లేషకులు సోషల్ మీడియాలో వెండి రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందన్న కథనాలు వచ్చాయి. దీంతో చాలామంది వెండిపై పెట్టుబడి పెట్టేందుకు మక్కువ చూపారు. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లు, బంగారం తాకట్టు పెట్టి ఆయనకాడికి వెండి కొనుగోలు చేశారు. ఇలా జిల్లాలో గడిచిన రెండు నెలల కాలంలో దాదాపు రూ.20 కోట్లపైనే వెండిపై పెట్టుబడులు పెట్టినట్లు అంచనా. అత్యధికంగా నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పెనుగొండ ప్రాంతాలకు చెందిన వ్యాపారులతోపాటు స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లు వెండిని కొనుగోలు చేశారు ఎంసీఎక్స్ మార్కెట్‌లో కాకుండా బహిరంగ మార్కెట్‌లో (మిగతా 8వ పేజీలో)

• కొనుగోలుకన్నా.. అమ్మకాలే ఎక్కువ



ప్రస్తుతం బులియన్ మార్కెట్‌లో సిల్వర్ బుల్ బేర్ ట్రెండ్ జరుగుతోంది. ధర ఇంకా తగ్గుతుందన్న భయం పెట్టుబడి దారుల్లో నెలకొంది. దీంతో కొన్న వెండిని అయినకాడికి అమ్మే స్తున్నారు. వీరిలో కొంతమంది లాభాలు స్వీకరిస్తుండగా.. ఎక్కువ మంది నష్టాలకే బుక్ చేసుకుంటున్నారు. మళ్లీ రికార్డుస్థాయి ధర రాదన్న భయంతోనే అమ్మకాలు చేస్తున్నారు.

- అత్మూరి వెంకట నరసయ్య, బులియన్ వ్యాపారి, నరసాపురం



భోజనం ఎలా వుంది ?

విద్యార్థినులను ప్రశ్నించిన కలెక్టర్

ఏలూరు అర్బన్/ ఏలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):'భోజనం ఎలా వుంది ? పదార్థా లన్నీ రుచిగా వుంటున్నాయా ? మెనూ ప్రకారం అన్నీ పెడుతున్నారా ? లేదా' అంటూ జిల్లా కలె క్టర్ వెట్రిసెల్వి ఏలూరు అశోక్‌నగర్‌లోని కె.పి.డి.టి. హైస్కూలు విద్యార్థినులను ప్రశ్నించారు. శనివారం ఆమె స్కూలును ఆకస్మికంగా సందర్శిం చారు. విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యతను భుజించి పరిశీలించారు. బాగాలేకుంటే చెప్పాలని చిన్నారులను కోరారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు తగిన సంఖ్యలో బిగించాలని డీఈవో వెం కట లక్ష్మమ్మకు ఆదేశాలు జారీ చేశారు. 8వ తర గతి గదిలోకి వెళ్లి ఇంగ్లీషు పాఠ్యాంశాన్ని చదవా ల్సిందిగా విద్యార్థినులను కోరగా సరిగా చదవలేక పోవడంతో టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని హితవు పలికారు. అలాగే భోజన పథకం పర్య వేక్షణ, నాణ్యతలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా కలె క్టరేట్‌లో వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత కార్యక్రమంలో పలు విభాగాల్లో చెత్తా, చెదారాలను తొలగించి, మొక్క లు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ వెట్రిసెల్వి చేప ట్టారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు.



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

33.75 లక్షల జీతం

శశి ఇంజనీరింగ్ విద్యార్థికి అమెజాన్‌లో ఉద్యోగం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి గూడెం శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐఎంఎల్ చదువుతున్న నంబుల దీపక్ సాయి అమె జాన్‌లో రూ.33.75 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్‌చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్‌లు విద్యార్థి దీపక్ సాయిని అభినందించారు. విద్యార్థులు నైపుణ్యంతో అవకాశాలు అందిపుచ్చు కోవాలని చైర్మన్ పేర్కొన్నారు.

నాన్న కష్టం చూస్తూ పెరిగాను : దీపక్

మాది తణుకు..నాన్న సత్యనారాయణ డ్రైవర్‌గా పనిచేస్తూ నన్ను, అన్నయ్యను బాగా చదివించారు. ఆయన శ్రమ చూస్తూ పెరిగాను. నాన్న కష్టానికి ఫలితం ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ఏఐఎంఎల్‌లో చేరినప్పుడే మంచి ఉద్యోగం సాధించాలని బలంగా కోరుకున్నాను. నా కల నెరవేరింది.

సమగ్రశిక్షా అభియాన్‌కు సెక్టోరల్ అధికారుల నియామకం

ఏలూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పర్యవేక్షణకు అధికారుల కొరతను ఏళ్ల తరబడి ఎదుర్కొం టున్న సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టుకు కొందరు సెక్టోరల్ ఆఫీసర్లను ఉన్నతాధికారులు నియమించారు. కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంవో)గా పూళ్ల జడ్పీ హైస్కూలు బయోలాజికల్ సైన్సు టీచరు డి.యెహోషువ నియమితులయ్యారు. ప్రత్యామ్నాయ పాఠశాలల (ఏఎల్ ఎస్)జిల్లా కో-ఆర్డినేటర్‌గా లింగపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న సొంగా నాగేశ్వ రరావును నియమించారు. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా దెందులూరు మండలం మసీదుపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ రెడ్డి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ ఏడాది వేసవిసెలవుల్లో జారీ అయిన నోటిఫికేషన్ మేరకు స్వీకరించిన దరఖాస్తుల నుంచి నిర్ణీత అర్హతలు గలవారి నుంచి మెరిట్, సర్వీసు వెయిటేజీ, ఇంటర్వ్యూల ఆధారంగా వీరి నియామకాలు జరిగాయి. ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టులో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్, ఉర్దూ ఏఎంవో నియామకాలు జరగాల్సి ఉంది.

41 కేసుల్లో దోషులకు శిక్షలు : ఏఎస్పీ



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నేరస్తులు శిక్ష నుంచి తప్పించుకోకూడదని బాధితులకు న్యాయం జరిగేలా, ముద్దాయిలకు శిక్షలు పడేలా సమర్థ వంతంగా కోర్టు మానిటరింగ్ సెల్ అధికారు లు, సిబ్బంది విధులను నిర్వర్తిం చాలని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో కోర్టు మానిట రింగ్ సెల్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 41 కేసుల్లో కోర్టు లు శిక్షలు విధిం చాయన్నారు. ప్రతి రోజు కోర్టుల్లో జరిగిన కేసుల వివరాలను స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలపాలన్నారు. డీసీఆర్బీ సిబ్బంది, కోర్టు మానిటరింగ్‌సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదం.. చెంతనే!

- అగ్ని ప్రమాద వస్తువులు, ద్రవాల మధ్యలో పోలీసు విధులు.. రక్షణ చర్యలు శూన్యం
- ఉమ్మడి జిల్లాల్లో పోలీస్ స్టేషన్లలో భారీ సంఖ్యలో సీజ్ చేసిన మోటర్ వాహనాలు
- సీజ్ వాటికి ప్రత్యేక యార్డు ఏర్పాటు చేస్తే సిబ్బంది సురక్షితం

- జిల్లాలో కొన్నేళ్ల క్రితం చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో బాణసంచాను భారీగా పట్టుకుని స్టేషన్ ఆవరణలోనే పెట్టారు. రాత్రి ఏడు గంటల సమయంలో అప్పటి ఆ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎం.సుధాకర్ (ప్రస్తుతం ఇంటిలిజెన్స్ డీఎస్పీ) తన సిబ్బంది స్టేషన్‌లో ఉండ గానే అకస్మాత్తుగా బాణసంచా పేలి పెద్ద ప్రమాదం సంభవించింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవ్వరు ఆవైపు లేకపోవడంతో ఎవరు ప్రమాదానికి గురి కాలేదు. సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయ్యారు. అప్పటి ఎస్ఐ సుధాకర్ సిబ్బందిని అప్రమత్తం చేసి రక్షణ చర్యలు తీసుకుని ఉన్నతాధికారులతో బేష్ అనిపించుకున్నారు.
- ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీజ్ చేసిన 150 మోటారు సైకిళ్లను రోడ్డు పక్కనే పార్కు చేసి ఉంచడంతో రాత్రి వేళ గుర్తు తెలియని ఒక వ్యక్తి సిగరెట్ కాల్చి పడవేయడంతో అది కాస్త పెట్రోల్ పైపుకి నిప్పు రవ్వ అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో అనేక మోటారు సైకిళ్లు, రెండు లారీలు దగ్ధమయ్యాయి. జంగారెడ్డి గూడెం పోలీస్ స్టేషన్‌లోను ఇలాంటి సంఘటనే సంభవించింది.

- ఏలూరు జిల్లాలో 33, పశ్చిమ గోదావరి జిల్లాలో 24 లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్ల ప్రాంగణాల్లో సీజ్ చేసిన వాహనాలు సుమారు 4 వేలు ఉన్నాయి. ఏలూరు నగరంలో మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో సుమారు 700 వాహనాలు ఉన్నాయి.

ఏలూరు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో శుక్రవారం (ఈనెల 14వ తేదీ) అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. శ్రీనగర్‌లోని నవ్‌గామ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ పేలుడు సంభవించి తొమ్మిది మంది మృత్యువాత పడగా మరో 27 మంది తీవ్ర గాయాల పాలైనట్టు ప్రాథమిక సమాచారం. మృతుల్లో పోలీసులు, ఫోరెన్సిక్ సిబ్బంది ఉన్నారని వెల్లడిస్తున్నారు. ప్రమాదానికి కారణం సీజ్ చేసిన పేలుడు పదార్థాలను పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్టి వాటిని పరిశీలిస్తుండగా ఈ ఘటన జరిగి పోలీస్ స్టేషన్ ధ్వంసమైనట్టు అక్కడ అధికారులు వెల్లడించారు. అయితే ఈ ఘటన నవ్‌గామ్ పోలీస్ స్టేషన్‌కే పరిమితం కాదు. ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లలో ఇంచుమించు ఇలాంటి పరిస్థితే నెలకొని ఉంది. అయితే అక్కడ వారు పేలుడు పదార్థాలను పోలీస్ స్టేషన్ ఆవరణలో భద్ర పరిచి ఉండవచ్చు. కాని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అగ్ని ప్రమాదానికి కారణమయ్యే వస్తువులు, సామగ్రి ప్రతి పోలీస్ స్టేషన్ చుట్టిముట్టే ఉన్నాయి. జిల్లాలో గతంలో స్టేషన్ల వద్ద మందుగుండు సామాగ్రి వల్ల జరిగిన ప్రమాద ఘటనలున్నాయి.

ఎటుచూసినా ప్రమాద కారకాలే..

సాధారణంగా పోలీసులు వాహనాలు తనిఖీలు చేసిన ప్పుడు అనుమానాస్పదంగా ఉన్నవాటిని సీజ్ చేస్తారు. వివిధ దొంగతనాల కేసుల్లో రికవరీ చేసిన వస్తువులను, వాహనాలను స్టేషన్ ఆవరణలోనే భద్రపరుస్తారు. గంజా యి, ఇతర మాదక ద్రవ్యాలు, హత్య కేసులు, దోపిడీలు, దొంగతనాల్లో ఉప యోగించిన వాహనాలను సీజ్ చేసి స్టేషన్ ఆవరణలోనే భద్రపరుస్తున్నారు. దీపావళి పండు గకు ముందు అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని తీసుకొచ్చి స్టేషన్ రూముల్లో భద్రపరుస్తున్నారు. ఇక సారా, గంజాయి, మద్యం కలిగిన వారిని అరెస్టు చేసి వాటిని సీజ్ చేసి స్టేషన్‌లోని రూముల్లోనే భద్రపరుస్తున్నారు. పాన్‌పరాగ్, గుట్కా వంటి వాటిని సీజ్ చేసి భద్రపరుస్తూనే ఉన్నారు. కానీ ఇవన్నీ అగ్ని ప్రమాదాలు జరిగితే త్వరితగతిన మంటలను వ్యాపింప చేసే పదార్థాలే.



ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసిన బైక్‌లు

స్టేషన్ల చుట్టూ మోటారు వాహనాలు

ప్రస్తుతం జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన వివిధ కేసుల్లో సీజ్ చేసిన మోటారు సైకిళ్ల ఆ స్టేషన్ చుట్టూ ఉన్నారు. ప్రతి ట్యాంకులోనూ పెట్రోలే ఎంతో కొంత ఉంటుంది. ఒక వేళ పెట్రోలు లేకపోయినా ప్రతి వాహనానికి టైర్లు, ట్యూబులు ఉంటాయి. స్పాంజ్ సీట్లు ఉంటాయి. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే మంటలు వ్యాప్తి చెందే అవకాశాలు (మిగతా 8వ పేజీలో)

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రవిచంద్ర
■ లోపలి పేజీలో..

ఇసుక.. డోంట్‌వర్రీ!



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- జిల్లాలో అంచనాకు మించి ఇసుక నిల్వలు
- 48వేల765 మెట్రిక్ టన్నులు సిద్ధం
- వేసవి సీజన్‌కు ఢోకా లేనట్లే

టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం లో కొరత లేకుండా సాఫీగా సరఫరా జరుగుతుండడంతో భవన నిర్మాణాలు, ప్రాజెక్టులు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాకాలం సీజన్ ముగియగా రానున్న వేసవి సీజన్‌కు అంచనాలకు మించి ఇసుక నిల్వలు ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చు కుంటున్నారు. రానున్న ఐదు నెలల సీజన్‌కు ఢోకా లేనట్లేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు 16 రీచ్‌లుండగా ప్రస్తుతం అవన్నీ పొరుగు జిల్లాలకు వెళ్లి పోయాయి. జిల్లాలోని వాగులు, గోదావరి పరివాహక ప్రాంతం, పోలవరంలో నిల్వలే జిల్లా అవసరాలను ఆదుకున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పొరుగు జిల్లాలోని తాడిపూడి రీచ్ నుంచి జిల్లాకు మేలో 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలను ఐదు స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ ఉంచారు. ఇందులో 12 వేల మెట్రిక్ టన్నుల మేరకు ఇసుక నిల్వ లను జిల్లాలో అవసరాలకు వాడారు. ఇంకా 48 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉండడంతో రానున్న వేస వికి ఈ ఇసుక సరిపోతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

స్టాక్ పాయింట్లతో సక్సెస్

జిల్లా యంత్రాంగం ముందస్తుగా ఐదు నియోజకవర్గాల్లో ఇసుక నిల్వలను ప్రైవేట్ కాంట్రాక్టర్లతో తోలించారు. చేబ్రోలు, చొదిమెళ్ల,చింతలపూడి, కైకలూరు, నూజివీడుల్లో స్టాక్ పాయింట్లను సిద్ధం చేశారు. ఇక్కడకు తాడిపూడి నుంచి వర్షాకాలం సీజన్ కోసం డంప్ చేశారు. ఇందులో తాజాగా అధికారుల నివేదిక ప్రకారం కైకలూరులో 10,773, చేబ్రోలులో 18,030, చింతలపూడిలో 683, చొదిమెళ్లలో 1,023, నూజివీడులో 18,316 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలున్నాయి. వీటి వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షలోనే ఇసుకను విక్రయాలు చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట

ఇటీవల జిల్లాలోని ఇసుక నిల్వలు తెలంగాణకు తరలిపోతున్నాయన్న ఆరోపణలతో చెక్‌పోస్టుల వద్ద మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం నిఘా పెట్టడంతో అక్రమార్కులకు అడ్డుకట్ట పడింది. మరింత పారదర్శకంగా ఇసుక మన జిల్లా అవసరాలకు సిద్ధంగా ఉంచాలన్న కలెక్టర్ ఆదేశాలతో మైనింగ్ శాఖాధికారులు అప్రమత్తం అయ్యారు.

ఐదు రీచ్‌లకు ముహూర్తం ఎప్పుడో ?

గోదావరి నది పరివాహక ప్రాంతంలోని కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, దాచారం, వింజరం, వేలేరుపాడు మండలంలో రుద్రమకోట-12 పాయింట్లను కలిపి మొత్తం ఐదు ఇసుక ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేయడానికి అంచనాలను ఫిబ్రవరిలోనే జిల్లా యంత్రాం గం పంపింది. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు, గ్రౌండ్‌వాటర్ డిపార్టుమెంట్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు ఇసుక రీచ్‌ల కోసం సాంకేతిక మంజూరు కోసం విజయవాడలోని ఎన్‌ఫోర్స్ మెంట్‌శాఖకు నివేదించారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఐదు రీచ్‌ల నుంచి మొత్తం 3.58 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనాలు వేశారు. తీరా పర్యావరణ అనుమతులు రాకపోవడంతో అధికారులు కొంత నిరాశలో ఉన్నారు. ఈ రీచ్‌ల అనుమతుల కోసం యంత్రాంగం సంప్రదింపులు జరుపుతోంది. 'జిల్లా అవ సరాలకు సరిపడా ఇసుక నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. తాడిపూడి నుంచి మన జిల్లా అవసరాలకు 30 వేల మెట్రిక్ టన్నుల తరలించుకోవడానికి మన వాటా కేటా యింపులున్నాయి. అవసరమైతేనే ఈ నిల్వలను జిల్లాకు కాంట్రాక్టర్ల ద్వారా తరలిస్తాం' అని మైనింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ పాపారావు తెలిపారు.

పరిహారం.. ఊరట

- పంట నష్ట పరిహారం పెంపు
- వరికి హెక్టారుకు రూ.5వేల నుంచి రూ. 8వేలు.. ఉద్యాన పంటలకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు

ఏలూరుసిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంట నష్టపరిహారాన్ని పెంచారు. మొంథా తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం కంటే పెంచి నష్ట పరిహారాన్ని చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేర కు గత వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఈసారి వరి పంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు అదనంగా రూ.5 వేలు నుంచి రూ.8 వేలు, ఉద్యాన పంటలకు అదనంగా రూ.8 వేలు నుంచి రూ.12,500 వరకు పెంచారు. దీంతో వరి పంటకు హెక్టారుకు రూ.25 వేలు, ఉద్యాన పంటలకు రూ. 22,500 నుంచి రూ.35 వేలు వరకు పెరిగింది.

- మొంథా తుఫాన్ కారణంగా ఇటీవల జిల్లాలో వరి తోపాటు ఇతర పంటలు 5704.24 హెక్టార్లలో, ఉద్యాన పంటలు 17.60 హెక్టార్లలో నష్టపోయారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ బృందం పంట నష్టాలను అంచనా వేయడానికి జిల్లాలో పర్యటించింది. ప్రస్తుతం సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఈ దశలో పెంచిన నష్టపరిహారం రైతులకు అందిస్తే వారికి ప్రయోజనం చేకూరుతుంది.
- ఉద్యాన పంటలలో ఆయిల్ పామ్, కొబ్బరి మొక్కలకు మొక్కకు గతంలో రూ.1000 ఇవ్వగా ఇప్పుడు పెంచిన నష్టపరిహారం ఆధా రంగా రూ.1500 మొక్కకు నష్టపరిహారం చెల్లిస్తారు. హెక్టారుకు 150 మొక్కలకు మాత్రమే ఈ నష్టపరిహారం అందుతుంది. కొల్లేరు నష్టాలను పరిశీలించిన సమయంలో గత జనవరిలో ఈ పంట నష్టపరిహారాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

వ్యవసాయ పంటలకు..

పంట రకం	గతంలో నష్ట పరిహారం (హెక్టారుకు రూపాయల్లో)	పెంచిన నష్ట పరిహారం (హెక్టారుకు రూపాయల్లో)
పత్తి	17,000	25,000
వేరుశనగ	17,000	25,000
వరి	17,000	25,000
చెరకు	17,000	25,000
మినుము	10,000	15,000
పెసలు	10,000	15,000
మొక్కజొన్న	10,000	15,000
కందులు	10,000	15,000
నువ్వులు	8,500	15,000
పొగాకు	10,000	15,000
సోయాబీన్	10,000	15,000

ఉద్యాన పంటలకు..

పంట రకం	గతంలో నష్ట పరిహారం (హెక్టారుకు రూపాయల్లో)	పెంచిన నష్ట పరిహారం (హెక్టారుకు రూపాయల్లో)
అరటి	25,000	35,000
పసుపు	17,000	35,000
కూరగాయలు	17,000	25,000
మిరప	17,000	35,000
బొప్పాయి	17,000	25,000
టమోటో	17,000	25,000
జామ	22,500	35,000
పూలు	17,000	25,000
ఉల్లి	17,000	25,000
నిమ్మ	22,500	35,000
మామిడి	22,500	35,000
కాఫీ	22,500	35,000
నర్సరీ	17,000	25,000
జీడిమామిడి	22,500	35,000

స్పోర్ట్స్ కార్నర్

ఆర్చరీ క్రీడాకారులకు జేసీ అభినందన


జేసీ రాహుల్‌తో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

భీమవరం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-14, 17 విభాగాల్లో ఆర్చరీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించిన క్రీడాకారులు భీమవరం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కు మార్‌రెడ్డిని శనివారం కలిశారు. ఆయన క్రీడాకారులను అభినందించారు. స్కూల్ గేమ్స్ అండర్ -17 విభాగంలో ఎం.సుహాస్, ఎం.సూర్య హంసిని బంగారు, వి.స్ఫూర్తి హంసిని వెండి, సబ్ జూనియర్ విభాగంలో సుహాస్ బంగారు, కనిష్క వెండి పతకాలను సాధించారు. స్కూల్ గేమ్స్‌లో పతకాలు సాధించిన వారు వారణాసిలో జరిగే 69వ నేషనల్ గేమ్స్‌లోను, సబ్ జూనియర్స్ విభాగంలో పతకాలు సాధించిన వారు అరుణాచల్‌ప్రదేశ్‌లో 23 నుంచి 30 వరకు జరిగే నేషనల్స్‌లో పాల్గొననున్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నూతక్కి మోహన్‌దాస్, డీఈవో ఇ.నారాయణ, స్పోర్ట్స్ అథారిటీ కోచ్ జయలక్ష్మి, ఇ.సాహితీ, పాల్గొన్నారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు యశ్వసిన్


యశ్వసిన్‌ను అభినందిస్తున్న ఎస్పీ అస్మి

భీమవరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):పాలకొల్లు పట్టణ ఎస్‌ఐ జీజే ప్రసాద్ కుమారుడు ఎ.కారుణ్య యశ్వసిన్ కాకినాడలో జరిగిన 37వ అంతర్ జిల్లా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 8-10 ఏళ్ల బాలుర ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్ విభాగంలో 2వ స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించాడు. డిసెంబరు 5 నుంచి విశాఖపట్నంలో జరగనున్న జాతీయ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. యశ్వసిన్‌ను ఎస్పీ నయీమ్ అస్మి, డీఎస్పీ డాక్టర్ జి.శ్రీవేద అభినందించారు.

ఆర్చరీలో హంసినికి కాంస్య పతకం


హంసినిని అభినందిస్తున్న సూర్యప్రకాశరావు

తణుకు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):తణుకు మాంటిస్సోరి జూనియర్ కాలేజీ విద్యార్థిని నిట్టా హంసిని ఈనెల 7, 9 తేదీలలో పాడేరులో స్టేట్ లెవెల్ అండర్ -17 ఆర్చరీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నట్లు మాంటిస్సోరీ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. హంసినీ, కోచ్ పార్వతి చకియాను అభినందించారు. హెచ్‌ఎం లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో జెస్విన్


జెస్విన్‌ను సత్కరిస్తున్న వాసవీ సభ్యులు

పాలకొల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని 78 దేశాల జాతీయ పతాకాలను గుర్తించి తన ప్రతిభను నాలుగేళ్ల చిన్నారి జెస్విన్ ప్రసాద్ చాటుకున్నాడు. పట్టణానికి చెందిన శ్రీఖాకొళ్ళపు రాజేష్, లలిత దంపతుల పెద్ద కుమారుడు జెస్విన్ ప్రసాద్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. తల్లిదండ్రులు చవువులపై మక్కువతో చిన్నారికి ఎన్నో అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆరు మాసాలు వచ్చేసరికే పలు దేశాల జాతీయ జెండాలను గుర్తించే విధంగా శిక్షణ ఇచ్చారు. వాహనాలు, జంతువులు పండ్లు, పక్షులు ఇదేవిధంగా సుమారు 300 పదాల వరకు నేర్పించడం జరిగిందని తల్లి లలిత తెలిపారు. చిన్నారిని స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్కరించారు. ఎంవీవీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం


నెట్ బాల్‌ను ఆడుతున్న క్రీడాకారులు

లింగపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వ ర్యంలో ధర్మాజీగూడెం క్రిసాలిస్ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్రస్థాయి అండర్-19 నెట్ బాల్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను బోర్డ్‌ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ టి.శేఖర్ బాబు, బోర్డ్‌ఆఫ్ ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్‌ఐఓ కే యోహాన్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పల్లి శ్రీను ప్రారంభించారు. తొలిరోజు అండర్-19 బాలికల విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా టీం కర్నూల్ టీంపై 14-01 గోల్స్‌తో గెలుపొందిందని జిల్లా అండర్-19 స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.జయరాజ్ తెలిపారు.

రాష్ట్రానికి పరిశ్రమలు.. ఓర్వలేకపోతున్న జగన్

మంత్రి నిమ్మల రామానాయుడు


అబ్బిరాజుపాలెంలో జలజీవన్‌మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

యలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు, పరిశ్రమలు క్యూకడుతుంటే జగన్ ఓర్వలేకపోతున్నాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామా నాయుడు అన్నారు. మండలంలోని అబ్బిరాజుపాలెంలో రూ.55 లక్షలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్ పనులు, కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శనివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించి, అభి వృద్ధి జరగకుండా అడ్డుకునే ప్రయత్నం వైసీపీ పేటీఎం బ్యాచ్ చేస్తోందని విమర్శించారు. తమ పాలనలో అభివృద్ధిని గాలికొదిలేసిన వైసీపీ నాయకులకు ప్రజల వద్దకు వచ్చే అర్హత, మాట్లాడే హక్కు లేదన్నారు. అర్థరూపాయి అభివృద్ధి చేయని వైసీపీకి ఎందుకు ఓటు వేశామా అని, ఓటు వేసిన ఇరవై, ముప్పై శాతం ప్రజలు ఆలోచించాలన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని అధిగమిస్తూనే సూపర్ సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. పెన్షన్ పెంపు, చదువుకునే ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, రైతులకు అన్నదాత సుఖీభవ, డీఎస్సీ ద్వారా 16,354 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు సాయం, అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. రహదారుల నిర్మాణాలు, పంట, మురుగు కాలువల్లో పూడిక, డెక్క తొలగింపు, పంత రోడ్ల నిర్మాణం, ప్రతి గ్రామంలోనూ తాగునీటి పథకా ల పనులు చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ అభివృద్ధి వైపు ఓటు వేయాలని, విధ్వంసం వైపు కాదని మంత్రి పేర్కొన్నారు. ఎన్డీఏ నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, ఉన్నమట్ల కబర్ధి, కడలి గోపాలరావు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, డేగల సత్యనారాయణ, చిట్టూరి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో
రైళ్లకు తాత్కాలిక స్టాప్

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో 16 రైళ్ళకు తాత్కాలికంగా స్టాప్‌లను కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో అది తగ్గించే దృష్ట్యా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో కూడా 14 రోజుల పాటు రైళ్ళను ఆపడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 7వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఈ రైళ్ళకు హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో స్టాప్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
12749 మచిలీపట్టణం - బీదర్, 17255 నర్సాపూర్ - లింగంపల్లి, 12737 కాకినాడ పోర్టు - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖ, 12775 కాకినాడ టౌన్-లింగంపల్లి, 17207 సాయినగర్ శిర్డి-మచిలీపట్టణం, 17205 సాయినగర్ షిర్డి-కాకినాడ పోర్టు, 18519 విశాఖ- ఎల్‌టిటి ముంబై, 17208 మచిలీపట్నం-సాయినగర్ షిర్డి, 17206 కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి, 12805 విశాఖ - లింగంపల్లి, 18520 ఎల్‌టీటీ ముంబై - విశాఖ, 12738 లింగంపల్లి - కాకినాడ పోర్టు, 17256 లింగంపల్లి - నర్సపూర్, 12750 బీదర్ - మచిలీపట్టణం

విర్డ్‌లో ఎముకల క్యాన్సర్ సేవలు


వైద్య చేస్తున్న అంకాలజీ సర్జన్ రాజీవ్‌రెడ్డి

ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విర్డ్ ఆసుపత్రిలో ఇకపై ఆర్థోపెడిక్ అంకాలజీ (ఎముకల క్యాన్సర్ స్పెషలిస్ట్) వైద్యసేవలు అత్యాధునికంగా అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో శనివారం ప్రముఖ ఆర్థోపెడిక్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ రెడ్డి వైద్యసేవలు అందించారు. ఇందులో భాగంగా ఐదుగురిని పరీక్షించి అందులో ఇద్దరికి శస్త్రచికిత్సలు డాక్టర్ రాజీవ్ రెడ్డి నేతృత్వంలో వైద్యబృందం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టీలు నారాయణమూర్తి ఎస్వీ నివృతరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పీవీ నాగేంద్రబాబు, సింధు, రమ్య, మహిత పాల్గొన్నారు.

19, 20 తేదీల్లో జాతీయ గణిత వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత అభివృద్ధిలో గణితం పాత్ర అనే అంశంపై ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. శనివారం కళాశాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వర్క్‌షాపు పోస్టర్లను ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇండియన్ అకాడమీ ఆఫ్ మాథ్స్ సైన్సెస్, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, తదితర జాతీయ సంస్థల నుంచి ప్రొఫెసర్లు, పరిశోధకులు, మేధావులు, పలు కళాశాలల విద్యార్థులు రెండురోజుల వర్క్‌షాపునకు హాజరవుతారని వివరించారు.

13 మంది జడ్పీ ఉద్యోగులకు పదోన్నతులు

ఏలూరు సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి 'పశ్చిమ' జడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న 13మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. వీరికి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ఉత్తర్వులను అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉద్యోగులు సేవా మార్గంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా పదోన్నతులు ఇవ్వటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. డిప్యూటీ సీఈఓ కె.భీమేశ్వర్ మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పని చేయాలన్నారు. జడ్పీ కార్యాలయ ఏఓ ఐవీ రాఘవులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో నాగసాధువులు



ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):చిన వెంకన్న ఆలయాన్ని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నాగసాధువులు సందర్శించారు. ఆలయానికి వచ్చిన వారు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు క్షేత్రానికి వచ్చిన భక్తులు వారిని విస్మయంతో చూశారు.

వరిపై మందులు పిచికారి చేయవద్దు

పెనుమంట్ర, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):వరి పంటలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు గుర్తించడం జరిగిందని రైతులు విచక్షణారహితంగా పురుగు మందులు, తెగులు మందులను పిచికారి చేయడం గమనించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ ఎన్. మల్లికార్జునరావు అన్నారు. సోమరాజు ఇల్లిందలపర్రులో శాస్త్రవేత్తల బృందం క్షేత్రస్థాయిలో వరి పంటపై ఆశించిన ఎండు తెగులును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఎంటీయు 1318 రకం కోతకు వచ్చేటటువంటి వరిపంటల పై ఏ విధమైన సస్యరక్షణ చర్యలు చేపట్టనవసరం లేదన్నారు. కోత దశలో ఉన్న వరిపై పిచికారి చేసి డబ్బులు వృథాచేసుకోవద్దని రైతులకు సూచించారు.



వైటీ రాజాకు ఘన నివాళులు

తణుకు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):తణుకు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే దివంగత వైటీ రాజా మార్గదర్శకత్వం చూపించారని రెరా సభ్యులు మం త్రిరావు వెంకటరత్నం అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వైటీ రాజా వర్ధంతి పురస్కరించుకుని సంతాప సభ నిర్వహించారు. వైటీ రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైటీ రాజా రాజకీయాల నుంచి వైదొలుగుతూ రాజకీయ విలువలు కలిగిన ఆరిమిల్లి రాధాకృష్ణను నియోజకవర్గానికి పరిచయం చేశారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిలో అదే ఒరవడిని ఎమ్మెల్యే రాధాకృష్ణ కొనసాగిస్తున్నారని తెలిపారు.


మంత్రి లోకేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ఎన్‌ఆర్‌ఐలు

ఎమ్మెల్యే రోషన్ చొరవతో పెట్టుబడులు

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవతో విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సులో ఎన్‌ఆర్‌ఐలు రూ.500 కోట్లు పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. శనివారం ఈ బృందం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఐటీ, బయోసైన్సెస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నట్లు ఈ బృందం ప్రతినిధి అశోక్ పేర్కొన్నారు. వీరితో రోషన్ తరచూ గ్రూపు సమావేశాలు జరిపి వారిని ఐటీలో పెట్టుబడులు పెట్టాలని ప్రోత్సహించారు. ఈ సదస్సులో భాగస్వామ్యం కల్పించడంతో శనివారం ఒప్పందంపై సంతకాలు చేశారు. ఒప్పంద సమయంలో యూఎస్ఏ ప్రతినిధులు ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే సదస్సులో పాల్గొన్నట్లు లోకేశ్ వివరించినట్లు రోషన్ క్యాంపు కార్యాలయం ప్రకటించింది.


సుమన్‌ను సత్కరిస్తున్న అంబికా కృష్ణ, ఉషాబాల బాలకృష్ణ

సుమన్‌కు సూపర్‌స్టార్ కృష్ణ విశిష్ట పురస్కారం

ఏలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా సూపర్‌స్టార్ కృష్ణ ఎప్పటికీ నిలిచిపోతారని, ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నట్టు ప్రముఖ సినీనటుడు సుమన్ తెలిపారు. సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో కృష్ణ తృతీయ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సినీ నిర్మాత అంబికాకృష్ణ, ఉషాబాల గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత వి.వి.బాల కృష్ణరావు హాజరయ్యారు. 'సూపర్ స్టార్ కృష్ణ విశిష్ట వ్యక్తి' పురస్కారాన్ని సుమన్‌కు ప్రదానం చేశారు. తొలుత ఏలూరులోని జన్మభూమి పార్క్ వద్ద ఉన్న కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొండపాడు పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఐఐటీ కెమికల్ విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ శర్మ అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో శనివారం ఫ్రం ఎర్త్ టూ మార్స్ ఫైనీరింగ్ మెటల్ సీవోటు బ్యాటరీ సొల్యూషన్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాటరీలు విద్యుత్‌ను రసాయన రూపంలో నిల్వ చేసుకుని అవసరమైనప్పుడు విద్యుత్ శక్తిగా మార్చుకుంటాయన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న లిథియం అయాన్ బ్యాటరీకి ప్రత్యామ్నాయంగా మెటల్ సీవోటు బ్యాటరీలపై విస్తృత పరిశోధనలు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వినోత్‌కుమార్‌రాజాలు చంద్రశేఖర్‌ను సత్కరించారు.

2న ఆక్వా సమస్యలపై ఆందోళన

పాలకొల్లు టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తీసుకు వస్తున్న ఆక్వా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆరోపించారు. ఇందుకు నిరసనగా డిసెంబరు 2న రొయ్య రైతులంతా ఆందోళనకు దిగనున్నామన్నారు. కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆక్వా రైతులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు.

శ్రీ వారి ఏడు వారాల దీక్ష స్వీకరణ


మాలధారుల దీక్షధారణ

ద్వారకాతిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందా.. అంటూ దాదాపు 30 మంది భక్తులు శనివారం వేకువ జామున శ్రీవారి ఏడువారాల దీక్షను స్వీకరించారు. ముందుగా ఆలయ ఆవరణలో పూజలు చేశారు. వీరంతా వచ్చేనెల 30న ముక్కోటి ఏకాదశి నాడు దీక్షా విరమణ చేస్తారు. అలాగే కార్తీక మాసం ఆఖరి శనివారం, ఏకాదశి పర్వదినం కారణంగా అధిక సంఖ్యలో భక్తులు చినవెంకన్న ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, క్యూకాంప్లెక్స్‌లు, అన్నదానం వద్ద భక్తుల సందడి నెలకొంది.

72 ప్రైవేట్ బస్సులపై కేసుల నమోదు



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీ అధికారులు ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై విస్తృతం గా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివా రం ఉదయం వరకు ఏలూరు జిల్లా కలపర్రు టోల్‌గేట్, జంగారెడ్డిగూడెంలో ఆర్టీవో ఎస్‌బి శేఖర్, ఎస్ఎస్ రంగనాయకులు పర్యవేక్షణలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు ప్రత్యేక బృందాలతో ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీలు నిర్వహించారు. మొత్తం 72 బస్సులపై 72 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. ఈ బస్సులపై 7 లక్షల 65 వేల 230 రూపాయల అపరాధ రుసుము విధించగా అప్పటికప్పుడే నాలుగు లక్షల 50 వేల 100 రూపాయలు వసూలు అయినట్లు తెలిపారు. ధ్రువపత్రాలు లేకపోవడం, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు, పాసింజర్ లిస్టులేని, తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలు ప్రతి రోజు నిర్వహిస్తామని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు.

ఒంటరి మహిళలే టార్గెట్

అంతర్ జిల్లా గొలుసుల దొంగ అరెస్టు


బాధితురాలికి పోగొట్టుకున్న బంగారాన్ని అందిస్తున్న ఎస్పీ నయీం

పెనుగొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఒంటరి మహిళలను టార్గెట్ చేసే అంతర జిల్లా గొలుసు దొంగను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇలపర్రు గ్రామంలో ఒక అపరిచిత వ్యక్తి బుల్లెట్ మోటారు సైకిల్‌పై వచ్చి సుమారు 67 వయస్సు గల చేకూరి బంగారమ్మ అనే మహిళ మెడలో నుంచి అడ్రసు అడుగుతున్నట్లు నటించి సుమారు 3 కాసుల బంగారపు తాడును బలవంతంగా లాక్కుని పారిపోయినట్లు తెలిపారు. పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పెనుగొండ ఎస్ఐ గంగాధర్, ఆచంట ఎస్ఐ కేవీ రమణ కలిసి రెండు బృందాలుగా ఏర్పడి కేసులో నిందితుడిని రెండు రోజులలో సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా పట్టుకున్నట్లు తెలిపారు. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కండ్రికపేట, ఆలమూరు గ్రామానికి చెందిన వాసంశెట్టి వీరబాబు నుంచి దొంగిలించిన వస్తువును తిరిగి స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపర్చినట్టు తెలిపారు. వీరబాబు వృత్తి రీత్యా డ్రైవర్. కాని చెడు అలవాట్లకు లోనై 2012 నుంచి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఇతనిపై అనేక పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితురాలికి ఎస్పీ చేతుల మీదగా బంగారం అందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఫాతిమాపురం అడ్డరోడ్డు వద్ద విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో శనివారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. ఈ తనిఖీ లో 35.09 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్ కలపాల సుధాకర్‌ను ప్రశ్నించగా కటారి శ్రీను, నున్నా రమేష్, చిలకమ్మ, సీతారాములుకు చెందిన రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి చాట్రాయి మండలం మర్లపాలెంకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రరావు, వంగల దత్తులకు కిలో 19 రూపాయలు చొప్పున అమ్ముతున్నట్టు తెలిపాడని అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో లక్షా 40 వేల 360 రూపాయలు విలువ గల బియ్యాన్ని, ఎనిమిది లక్షల రూపాయలు విలువ చేసే వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌తోపాటు అతనికి తెలిపిన వారందరిపై కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో విజిలెన్స్ ఎస్ఐ సి.హెచ్.రంజిత్‌కుమార్, మండల డీటీ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థికి గాయం

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి మెడపై గాయం, రక్త మరకలు శనివారం తెల్లవారుజామున పాఠశాల యాజమాన్యం గమనించి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదే హాస్టల్‌లో చదువు తున్న మరో విద్యార్థి తెల్లవారుజామున నిద్రిస్తున్న సమయంలో పెన్సిల్ చెక్కె చాక్ మర్‌లో ఉండే బ్లేడుతో గాయపరి చినట్టు చెబుతున్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ గురుకుల పాఠశాలకు వెళ్ళి నిర్ధారణ జరిపారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య మనస్పర్థల కారణంగా ఈ సంఘటన జరిగిందని, మైనర్ విద్యార్థులు కావడంతో దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. దీనిపై డీవైఈవో సుధాకర్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

సబ్ రిజిస్ట్రార్ అధికారులపై వేటు

ఉండి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేశారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకినాడ బదిలీపై వెళ్లిన ఎం.వి సుధారాణి, సీనియర్ అసిస్టెంట్ పి. సారబంధు రాజులను సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ జనరల్ మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. వెబ్‌ల్యాండ్ వివరాలు, అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం పంపిన పరి శీలన బృందం నివేదిక ఆధారంగా సబ్ రిజి స్ట్రార్ కార్యాలయం అధికారులపై చర్యలు తీసు కున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నట్లు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలంలోని ఒక గ్రామా నికి చెందిన 14 ఏళ్ల బాలికతో ఏలూరు రూరల్ మండలం లింగారావుగూడానికి చెందిన తుని మెల్లి మణికంఠ (20) పరిచయం చేసుకుని మాయమాటలు చెప్పి ప్రేమిస్తున్నానని నమ్మ బలికాడు. బాలికతో శారీరక సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఆ బాలిక మందుబిళ్ళలు మింగి ఒక ఆసుపత్రిలో చేరింది. ఏలూరు రూరల్ పోలీసులు మణికంఠపై శనివారం రాత్రి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదమల్లంలో కార్డెన్ సెర్చ్


మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని రికార్డులు పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఆచంట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పెదమల్లంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సోదాల్లో సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, యజమాని వివరాలు సరిగ్గా లేని పలు ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలు వాహనాలకు సంబంధించి రికార్డులుక్షుణ్ణంగా పరిశీలించేందుకు వాటిని ఆచంట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ విజయ కుమార్ గ్రామంలోని స్థానిక ప్రజలతో ముఖాముఖి మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చినపుడు ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గమనించినట్లయితే ఎలాంటి భయం లేకుండా వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని గ్రామస్థులను కోరారు. ఈ తనిఖీలలో ఎస్ఐలు కె. వెంకట రమణ, కె. స్వామి, కె. గంగాధర్ పాల్గొన్నారు.


డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందిస్తున్న ఎస్ఐ నాగమణి

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రవిచంద్ర

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా యు.రవిచంద్ర శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరులో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా మహిళా ఎస్ఐ నాగమణి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మహిళలపై జరిగే నేరాలపై వేగవంతమైన, పారదర్శకమైన విచారణ చేపడతామన్నారు. శక్తి టీమ్ సభ్యు లతో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కాలేజీల వద్ద మహిళలు, బాలికలపై ఆకతాయిలు వేధింపులకు గురి చేయకుండా గట్టి గస్తీ నిర్వహిస్తామన్నారు.

చోరీ కేసులో హిజ్రా అరెస్టు

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఈదరలో ఇటీవల జరిగిన చోరీ కేసులో షేక్ మున్నా అలియాస్ (సిరి) అనే హిజ్రాను అరెస్టు చేసి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. ఈ నెల 3న కొత్త ఈదరలోని బెక్కం పెద్ద సీత ఇంట్లో బంగారం చోరీ కావడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శుక్రవారం హైస్కూల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న హిజ్రాను అదుపులోకి తీసుకొని విచారించి నాలుగు బంగారు ఉంగరాలు, చెవి దిద్దులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హిజ్రాపై 22 కేసులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

విశాఖ సదస్సు విజయవంతం : ఎంపీ పుట్టా

ఏలూరు టూటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో 13 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదరడం పట్ల ఎంపీ మహేశ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఇటీవల పరిశ్రమల స్థాపన, పెట్టుబడులలో రాష్ట్రం నెంబర్ వన్‌స్థానంలో నిలబడిందన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం మరింతగా దిగజారిందన్నారు. చంద్రబాబు రెండోసారి సీఎం అయిన తరువాత మళ్లీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని అన్నారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు వారి ఆధ్వర్యంలో 28 నుంచి ఉచితంగా మగ్గం వర్క్‌పై శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది. 10వ తరగతి ఆపైనా విద్యార్హత కలిగి ఉండి, 18-45 సంవత్సరాల వయస్సు గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 31 రోజుల శిక్షణ కాలంలో ఉచితంగా భోజనం, వసతి, మెటీరియల్ అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు వట్లూరు టీడీపీ పక్కన ఉన్న కార్యాలయం వద్ద గాని, 95027 23561, 95330 79471 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికతపై అతిథి ఉపన్యాసం

ఏలూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పదార్థాల(మెటీరియల్స్) విశ్లేషణలో మాస్‌స్పెక్ట్రోమెట్రిక్ సాంకేతికతలనే అంశంపై శనివారం స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ సీఎస్‌ఐఆర్-ఐఐసీటీ సీనియర్ సైంటిస్టు డాక్టర్ విజయసారథి మాట్లాడుతూ నేరపరిశోధనలో కీలకమైన సాక్ష్యాలను విశ్లేషించడానికి, నిర్ధారించడానికి మాస్‌స్పెక్ట్రోమెట్రిక్ టెక్నాలజీ ఒక శక్తివంతమైన సాధనమన్నారు. రక్తనమూనాలు, మూత్రం, కేశాలు, కణజాలాల్లో ఉన్న ఔషధాలు, డ్రగ్స్, విషపదార్థాలు, ఆల్కహాల్ ఉనికిని, సాంద్రతను, పేలుడు పదార్థాల అవశేషాలను ఖచ్చితంగా గుర్తిస్తుందన్నారు. సాంప్రదాయ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్‌కు భిన్నంగా, మాస్‌స్పెక్ట్రోమెట్రిక్ డీఎన్ఏ విశ్లేషణలో కొత్త పద్ధతులు అందిస్తుందన్నారు. డాక్టర్ విజయసారథిని కళాశాల ప్రతినిధులు సత్కరించారు. కరస్పాండెంట్లు కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ యలమర్తి బాబు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో నేడు యాదవ కార్తీకవన సమారాధన

దెందులూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలోని సీతారామ ప్రభుత్వ వ్యాయామ కళాశాల ఆవరణలో ఆదివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్టు జిల్లా యాదవ్ సంఘం అధ్యక్షులు ముమ్మిడి చింతయ్య యాదవ్, గౌరవ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు, మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, స్టేట్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్‌తో పాటు రాష్ట్ర స్థాయిలో పలువురు ఎమ్మెల్యేలు, సంఘ నాయకులు పాల్గొంటారని నియోజకవర్గ యాదవ్ సంఘ అధ్యక్షుడు తలకొండ జమలయ్య, నియోజకవర్గ కార్యదర్శి నున్న లక్ష్మణ్, రాష్ట్ర సెక్రటరీ కర్రేటి శ్రీహరి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నరలో ప్రజలకోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు.

గుండె ఆపరేషన్ చేయించుకున్న కోర్టు ఉద్యోగిని మృతి


లక్ష్మీకుమారి (ఫైల్)

ఏలూరు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థలో స్టెనో కం టైపిస్టుగా పనిచేస్తున్న ఎలిపె లక్ష్మీ కుమారి(45) గుండె ఆపరేషన్ చేసిన మరుక్షణమే ఆమె మృతి చెందారు. ఏలూరు మండలం సత్రంపాడులో నివాసముంటున్న లక్ష్మీకుమారి ప్రస్తుతం ఏలూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్టెనో కం టైపిస్టుగా విధులు నిర్వర్తిస్తున్నారు. లక్ష్మీ కుమారికి గతంలో గుండెకు రంధ్రం ఉందని ఆపరేషన్ చేశారు. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి ఆపరేషన్ చేసిన కొద్దిసేపటికే ఆమె మరణించారు. లక్ష్మీకుమారి భర్త కొండా రవికుమార్ నారాయణపురం డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇంటర్ చదువుతున్న కుమార్తె ఉంది. లక్ష్మీకుమారి మృతదేహాన్ని ఆమె స్వగృహమైన ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు శని వారం సాయంత్రం తీసుకురాగా ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు, సిబ్బంది నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఏఆర్‌డీజీకే విద్యార్థుల ఎంపిక

ఏలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):ఆదివారపుపేట ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే 69వ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నమట్ల కాంతి జయకుమార్ తెలిపారు. ఎంపికైన టి.వనిత, కె.ధనుష్, జి.నవీన్‌రెడ్డిని వ్యాయామ ఉపాధ్యాయులు తోట శ్రీనివాస్ కుమార్, అబ్బు దాసరి, జోజి బాబు అభినందించారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి



టి.నరసాపురం/ చింతలపూడి/ ఏలూరు టూ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టి.నరసాపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాల కుడు ఆర్.కిషోర్ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సీనియర్ అసిస్టెంట్ బి.హరిబాబు, విజన్ యుపి స్కూల్ కరెస్పాండెంట్ పురం శ్రీనివాస్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ అంబటి రాంబాబు విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తక పఠనం చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సీఆర్‌ఆర్ కళాశాల ప్రొ ఫెసర్ కేబీఎస్.గోపాల్ అన్నారు. గ్రంథాలయ ఉత్సవాల్లో భాగంగా ఏలూరులోని గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో పంచాక్షర కవి సమ్మేళనం నిర్వహించారు. లైబ్రేరియన్ వీటి.సందీప్ కుమార్, ఎల్.వెంకటేశ్వరరావు, అస్లాంభాష పాల్గొన్నారు. బాలల గ్రంథాలయంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకపఠనం అలవరుచుకోవాలన్నారు. గ్రంథపాలకురాలు శోభ, కే.రమేశ్‌బాబు, పద్మనాభరావు, వీ.కొండల్రావు, ఎల్.చాముండేశ్వరరావు పాల్గొన్నారు. మహిళా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమాల్లో గ్రంథపాలకురాలు నాగమణి, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఈదుబిల్లి సుశీల, మాజీ కార్పొరేటర్ పద్మావతి పాల్గొన్నారు.

ప్రమాదం.. చెంతనే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. రబ్బరు వస్తువులు, వైర్లు ఇలాంటివి స్టేషన్లలో ఉన్నాయి. ఇక స్టేషన్ రూముల్లో సీజ్ చేసిన మద్యం, పాన్‌పరాగ్, గుట్కా, గంజాయి వంటివి ఉన్నాయి. గతంలోనే ఒక రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఇలాంటి సీజ్ చేసిన అన్నింటిని ప్రత్యేకంగా ఒక యార్డులాంటిది ఏర్పాటు చేసి అక్కడ భద్రపరిస్తే ఎంతో సురక్షితమని భావించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినప్పటికి బుట్టదాఖలైనట్లే తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాదపు అంచుల్లోనే తమ విధులను నిర్వర్తిస్తున్నారని భావించవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యలు పరిశీలించి అటు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు, ఇటు వివిధ సమస్యలతో న్యాయం కోసం వచ్చే ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞులు కోరుతున్నారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణగా తీసుకుని ఉమ్మడి జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులు, ద్రవాలను వేరే ప్రాంతాల్లో నిల్వ ఉంచాలని కోరుతున్నారు.

సిల్వర్ షాక్ !

(5వ పేజీ తరువాయి)

చైనా బార్, పూసల్ని లిక్విడ్ రూపంలో కొనుగోలు చేశారు. కొందరు స్టాక్ లేక పోవడంతో అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. అత్యధిక వ్యాపారం నరసాపురం, భీమవరం మార్కెట్‌ల్లో జరిగింది.

ఒక్కసారిగా పతనం : మార్కెట్ అంచనాలన్నీ గత నెల రెండో వారంలో పటాపంచలయ్యాయి. ఇజ్రాయేల్, పాలస్తీనా మధ్య ఒప్పందం, చైనా, అమెరికాల మధ్య వాణిజ్య ట్రేడ్‌పై ట్రంప్ సానుకూల ప్రకటనల ప్రభావం బులియన్ మార్కెట్‌పై పడింది. దీంతో అమ్మకాలు మొదలయ్యాయి. ఒకానొక దశలో ఒక్క రోజులోనే కేజీ వెండి రూ.10 వేలు పతనమైంది. దీన్ని చూసిన మదుపుదారులు కలవరపడ్డారు. రానున్న రోజుల్లో 2007, 2011 నాటి పరిస్థితులు వస్తాయన్న భయంతో కొన్న వెండిని ఆయినకాడికి అమ్మకాలు మొదలుపెట్టారు. అప్పట్లో పతనమైన వెండి మళ్లీ పెరుగుదలకు 14 ఏళ్లు పట్టింది. ఇంతకాలం పెట్టుబడి పెట్టి కూర్చుంటే వడ్డీ నష్టమని భావించి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఇటు వ్యాపారులు కూడా ధర తగ్గించి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

అజ్ఞాతం వీడిన ఎంఈవో

ఏలూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారిక సమాచారం, అనుమతులు లేకుండా ఈ ఏడాది సెప్టెంబరు 24 నుంచి విధులకు గైర్హాజరవుతున్న నూజివీడు ఎంఈవో-2 జమలయ్య శనివారం హఠాత్తుగా డీఈవో కార్యాలయానికి వచ్చారు. తనను విధుల్లో జాయిన్ చేసుకోవాల్సిందిగా డీఈవో వెంకట లక్ష్మమ్మను కలిసి అభ్యర్థించారు. రెండు నెలల పాటు అనధికార సెలవులో వున్న ఆయనకు కాకినాడ ఆర్జేడీ షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయాన్ని డీఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. నోటీసుకు సమాధానం ఆర్జేడీకే ఇచ్చి జాయినింగ్ పర్మిషన్‌ను అక్కడి నుంచే తెచ్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేయడంతో ఆయన వెనుదిరిగారు. ఆయన అదృశ్యంపై పలు విషయాలు ప్రచారంలో ఉండగా, శనివారం డీఈవో కార్యాలయంలో ప్రత్యక్షమవడంతో డైలమాకు తెరపడింది.


కార్మికులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి


గోపన్నపాలెం ర్యాలీలో పాల్గొన్న చింతమనేని


టి.నరసాపురంలో కార్మికులకు సన్మానం

స్వచ్ఛాంధ్రను సాధించాలి

జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

ప్రతి ఒక్కరూ సహకరించాలంటూ పిలుపు

ఏలూరుటూటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం పెంపొందుతుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 23వ డివిజన్ పిరంగుల దిబ్బలో స్వచ్ఛంధ్రా, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి మొక్కలునాటారు. ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్, నగర టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం సత్రంపాడు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూజ, డాక్టర్ దీప్తి, డెమో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● దెందులూరు: గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత సమర్థవంతంగా అమలు చేసినప్పుడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అవుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని గోపన్నపాలెంలో చెత్తను తొలగించే పనుల్లో ఎమ్మెల్యే చింతమనేని స్వయంగా పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని సర్పంచ్ ఏసమ్మ, తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో మండల స్థాయి ఉద్యోగులు, టీడీపీ కూటమి నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరరావు, సంపంగి వేణుగోపాల తిలక్, యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మహేశ్ యాదవ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కలపాల శ్రీహరి పాల్గొన్నారు.

● భీమడోలు:చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పారదర్శకంగా జరగాలని డీపీవో కె.అనూరాధ సూచించారు. పోలసానపల్లి కేంద్రాన్ని శనివారం డీపీవో సందర్శించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామానికి వచ్చిన డీపీవో పారిశుధ్య కార్మికులను సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. ఎంపీడీ పద్మావతిదేవి, సర్పంచ్ షేక్ హసీనా రహీమా బేగం పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: స్వచ్ఛాంధ్రలో భాగంగా ఏలూరు ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో పారిశుధ్య కార్యక్రమాన్ని ఆర్ముడు రిజర్వు సిబ్బంది శనివారం నిర్వహించారు. ఏలూరు ఏఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, ఆర్ఐ సతీశ్, ఆర్ఎస్ఐలు సిబ్బంది ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు ప్రబలవన్నారు. అనంతరం సిబ్బంది చేత డీఎస్పీ చంద్రశేఖర్ ప్రతిజ్ఞ చేయించారు.

● ఏలూరు రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియం ఆవరణలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్రలో భాగంగా మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించారు. రూరల్ మండలంలోని గుడివాక లంకలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనే విషయాలపై వివరించారు. ఉపాధ్యాయులు ఎస్.వరలక్ష్మి, ఎస్.సుమశ్రీ, బి.రాము ఉన్నారు.

● చింతలపూడి: స్వర్ణాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వ్యక్తిగత, సామూహిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్.జె.కె. నరేంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

● టి.నరసాపురం: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీవో జి.మణికుమారి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పి.శేఖర్‌బాబు, రఘురామ్, శివ, రవి పాల్గొన్నారు.

టీడీపీ ఏలూరు పట్టణాధ్యక్షుడికి సత్కారం

ఏలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీ సెల్ ఏలూరు పట్టణాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా గౌరీ దేవి ఆలయ సంక్షేమ కమిటీ కార్యదర్శి తంగేటి మనోహర్‌ను ప్రముఖ నృత్య కళాకారులు, గానుగుల పేట, గౌరీదేవి ఆలయ సంక్షేమ కమిటీ గౌరవాధ్యక్షులు కె.వి.సత్యనారాయణలు శాలువాతో సత్కరించారు. ఆలయ అధ్యక్షులు ఆల్తీ సాయిప్రసాద్, కోశాధికారులు గెద్దాడ ఏడుకొండలు, కొత్తల రాజు, కమిటీ సభ్యులు సాలిపల్లి మురళి,కాగాని సురేష్, బొడ్డు సురేశ్, జిల్లా శ్రీనివాస్, కర్పూరపు శ్రీను పాల్గొన్నారు.


స్వామివారి చిత్రపటం అందుకుంటున్న మంత్రి నిమ్మల

మద్దిలో తెలంగాణ మంత్రి తుమ్మల

జంగారెడ్డిగూడెంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని శనివారం ఉదయం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వాహణాధికారిని చందన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో మంత్రి తుమ్మల కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.

ఘనంగా పంచామృతాభిషేకం..

కార్తీక మాసం సందర్భంగా గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. శనివారం స్వామికి పంచామృతాభిషేకం ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 5వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు ఈవో ఆర్.వి.చందన తెలిపారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

టి.నరసాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి సొసైటీలు దోహదపడతాయని టి.నరసాపురం సొసైటీ చైర్ పర్సన్ జోనుబోయిన సోంబాబు తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సొసైటీ ఆవరణలో శనివారం సహకార జెండాను ఆవిష్కరించారు. సొసైటీ పర్సన్‌లు ఉయ్యూరి నాగమణి, మోదుగు వెంకట రామారావు, నీటి సంఘం అధ్యక్షులు కె.మోహన్ కుమార్, అద్దంకి జగ్గారావు, పెద్దిన సత్యనారాయణ పాల్గొన్నారు.

కుక్కునూరులో బిర్సాముండా జయంతి

కుక్కునూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ వీరుడు బిర్సాముండా జయంతిని శనివారం కుక్కునూరులో నిర్వహించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన బిర్సాముండా యువతకు ఆదర్శప్రాయుడన్నారు. ఆదివాసీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనాథాశ్రమాలకు బియ్యం వితరణ

కుక్కునూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అనాథలైన తోటి విద్యార్థులకు శ్లోక కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు అండగా నిలిచారు. శనివారం స్కూల్ యాజమాన్యం ఛారిటీడే నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు 15క్వింటాళ్ల బియ్యం, 26కేజీల కందిపప్పు, 30కేజీల పంచదార, 10 కేజీల పెసర పప్పు, 50దుప్పట్లు, 50 ప్లేట్లు, 200జతల వస్త్రాలు సేకరించారు. వీటిని జంగారెడ్డిగూడెంలోని అమ్మప్రేమ స్వచ్ఛంద సంస్థ, భద్రాచలంలోని కరుణ్యా చైల్డ్‌కేర్ సెంటర్‌లో ఉన్న అనాథ పిల్లలకు అందజేశారు. సర్పంచ్ రావు మీన, ఉప సర్పంచ్ పిచ్చుకరాజు, పాఠశాల కరస్పాండెంట్లు మాదినేని శ్రీనివాస్, పిచ్చుక మనోజ్ కుమార్, జనసేన అధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, సీపీఐ నాయకులు కొన్నే లక్ష్మయ్య పాల్గొన్నారు.

మోటారు సైకిల్ చోరీ

పెదపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కలపర్రు టోల్‌గేట్ సమీపంలోని గౌరీశంకర్ హోటల్ వద్ద నిలిపి ఉంచిన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు తోలం లోవబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాకినాడ జిల్లా పాతకొట్టం ప్రాంతానికి చెందిన లోవబాబు మోటార్‌సైకిల్‌పై విజయవాడ వెళ్తూ మార్గమధ్యలో హోటల్లో భోజనం చేసి వచ్చేసరికే ఎత్తుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏఎస్ఐ గజపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లాభాల్లో పెదపాడు సొసైటీ

పెదపాడు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి పెదపాడు సొసైటీ రూ.70,26,723 నికర ఆదాయాన్ని ఆర్జించినట్టు పెదపాడు సొసైటీ అధ్యక్షులు గారపాటి స్టాలిన్ తెలిపారు. సొసైటీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సొసైటీ అధ్యక్షులు స్టాలిన్ మాట్లాడుతూ ఈ ఏడాది ఖాతాదారుల షేర్ ధనంపై 15 శాతం లాభాలను అనగా అందించినట్టు తెలిపారు. మంగళవారం ఖాతాదారులకు సొసైటీ వద్ద అందజేస్తామన్నారు. అనంతరం సొసైటీ సీఈవో డి.వి.సుబ్బారావు సొసైటీ జమా-ఖర్చులను సభ్యులకు తెలియజేశారు. సంఘ డైరెక్టర్లు ఖండవల్లి కాలేబు, సురేశ్ పాల్గొన్నారు.


బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నెక్స్‌జన్ ఆక్వా ఫీడ్స్ బ్రాంచ్ ప్రారంభం

భీమడోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): దీపక్ నెక్స్‌జన్ ఫీడ్స్, ఐఫీడ్ ఉత్పత్తుల నూతన బ్రాంచ్, ఆక్వా ల్యాబ్‌ను గుండుగొలనులో ప్రారంభించారు. ఐఫీడ్ పంపిణీ కేంద్రాన్ని ఆక్వా ల్యాబ్‌ను ఆక్వా రైతులు ఎన్‌వీవీఎస్ వర్మ, వేగేశ్న సురేష్ రాజు, తరుణ్‌రాజ్, విజయేంద్రవర్మలు ప్రారంభించి రైతులు సద్వినియోగ పర్చుకోవాలని సూచించారు. ఏలూరు ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, పెన్మెత్స బోసిరాజు, మల్లేశ్వరరావు, శివనాగరాజు పాల్గొన్నారు.

శిశువులను సంరక్షించాలి

ఏలూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):నవజాత శిశువుల సంరక్షణ వారోత్సవాలను శనివారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మాతాశిశుసంరక్షణ విభాగం(పీపీ యూనిట్)లో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ ప్రారంభించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 21వరకు జరుగుతాయి. డీఐవో మాట్లాడుతూ శిశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ లావణ్య మాట్లాడుతూ శిశువులకు తల్లిపాలు మాత్రమే పట్టాలన్నారు. పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ ఆనంద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూజ, డీపీహెచ్ఎన్‌వో డాక్టర్ జ్యోతి, డెమో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారా కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

లింగపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో సారా స్థావరాలు, అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపులపై దాడులు జరిపి పాత సారా కేసుల్లో నిందితులను బైండ్‌ఓవర్ చేసినట్టు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ సీఐ పి.అశోక్ మాట్లాడుతూ సారా కేసుల్లో ఉన్న వేములపల్లి గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని లింగపాలెం తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండ్ ఓవర్ చేసినట్టు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒక కుటుంబానికి నమ్మిన వ్యక్తిగా అన్ని విషయాల్లో సహాయం చేస్తున్నట్లు నమ్మించి చివరకు వారి ఆస్తినే తన పేరున మార్చుకుని వేరే వారికి విక్రయించాడో ఘనుడు.. నగర పాలక సంస్థలో ఇంటి పన్ను కట్టడానికి వెళ్లగా ఇల్లు వేరే వారి పేరున ఉందని చెప్పడంతో బాధితులు అవాక్కయ్యారు. ఏలూరు టూటౌన్ పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో చీటింగ్ కేసు నమోదు చేశారు. ఏలూరు రామచంద్రరావు పేట ఈదరవారి వీధిలో నివాసం ఉంటున్న ఈదర వెంకట రమణ ప్రసాద్‌కు చెందిన 437 గజాల్లో ఉన్న వెంకట రమణ కల్యాణ మండపాన్ని ఏలూరునకు చెందిన దండు లక్ష్మీపతిరాజు మాయ మాటలు చెప్పి కొన్ని డాక్యుమెంట్స్‌పై వెంకట రమణ ప్రసాద్ ఆయన కుమారుడు వెంకట రామారావుతో సంతకాలు చేయించుకున్నాడు. కోటి రూపాయల లోను ఇప్పిస్తానని నమ్మబలికి కాగితాలను కూడా రాయించుకున్నాడు. టీవల వెంకట రమణ ప్రసాద్ తన కల్యాణ మండపానికి నగరపాలక సంస్థకు పన్ను చెల్లించే నిమిత్తం వెళ్ళగా అది నంబూరి ప్రభావతి పేరున ఉందని, ఆమెకు దండు లక్ష్మీపతిరాజు ఈ ఏడాది ఫిబ్రవరిలో రిజిస్టర్ చేశారని నగరపాలక సంస్థవారు వెల్లడించారు. మోసపోయామని గ్రహించి వెంకట రమణ ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

బీసీల సమగ్ర కులగణన జరిపించాలి

ఏలూరు రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు బీసీల జనాభా దామాషా ప్రకారం చట్టబద్ధ రిజర్వేషన్లు అమలయ్యేలా, రాష్ట్ర ప్రభుత్వం ముందుగా డెడికేటెడ్ కమిషన్ ద్వారా సమగ్ర కుల గణన జరిపించాలని, బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్నేపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులగణనపై రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు బీసీల జనగణన - వర్గీకరణలు జరపకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. 139 బీసీ సామాజిక వర్గాల్లో ఎవరు ఎంత శాతం జనాభా ఉన్నారో తెలయకుండా రిజర్వేషన్లు ఎలా అమలు జరుపుతారని ఆయన ప్రశ్నించారు. మొత్తం ప్రక్రియ 2026 ఏప్రిల్ నాటికి పూర్తి చేసి ఎన్నికలు జరపాలన్నారు. కిమిడి రేణుకేశ్వరరావు, తాడిశెట్టి దుర్గారావు, అడ్రంగి మాణిక్యం, కసిరెడ్డి దుర్గారావు, బి ఫణికుమార్, మత్స పాపారావు, పి వెంకటేష్, పెద్దిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తాం

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):చింతలపూడి నియోజకవర్గంలో సంక్రాంతి నాటికి రహదారుల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. శనివారం ఆర్‌అండ్‌బీ జిల్లా కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. జంగారెడ్డిగూడెం-ఏలూరు ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.10కోట్లు, రూ.6కోట్లతో చింతలపూడి-రావికంపాడు రోడ్డు పనులు ప్రారంభిస్తామని, చింతలపూడి- ఏలూరు, మేడిశెట్టివారిపాలెం రోడ్డుకు రూ.4.14 కోట్లు మంజూరయ్యాయని టెండర్‌లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. చింతలపూడి-కామవరపుకోట రోడ్డును రూ.1.8 కోట్లతో మరమ్మతులు చేపడతామన్నారు. రంగాపురం- తడికలపూడి, రంగాపురం- జీలకర్రగూడెం రోడ్డు అభివృద్ధికి 2.90 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. చింతలపూడిటౌన్, ధర్మాజీగూడెం సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4కోట్లతో ప్రతిపాదన చేశామని సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నారు.

లింగపాలెంలో మరుగుదొడ్లు నిర్మించండి

» మండల కేంద్రానికి వచ్చే ప్రజల ఆవేదన

లింగపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏదైనా పని నిమిత్తం మండల కేంద్రమైన లింగపాలెం వస్తే వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు లేవు. మండల కేంద్రానికి ప్రతి రోజూ వివిధ పనుల నిమిత్తం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తుంటారు. ముఖ్యంగా మహిళల రాకపోకలు అధికంగా ఉంటుంది. అయితే మండల కేంద్రానికి వస్తున్న జనాభాకు అనుగుణంగా సరైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పురుషులను మినహాయిస్తే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేసేది లేక కొంతమంది ఖాళీ స్థలాల్లో మూత్రవిసర్జన చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్గంధంగా వాపోతున్నారు. ఇప్పటికైనా మండలకేంద్రంలో మరుగు దొడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం తంగెళ్లమూడిలో పేకాడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి పేకాడుతున్నారనే సమాచారంతో దాడి చేసి రూ.లక్షా 19 వేల నగదు స్వాధీనం చేసుకుని 11 మందిపై కేసు నమోదు చేశామన్నారు.

'పనిచేయని అధికారులు సర్దుకోవాల్సిందే'


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిర్రి

బుట్టాయగూడెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేఆర్ పురం ఐటీడీఏలో పనిచేస్తున్న అధికారుల ప్రక్షాళణకు చర్యలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. గిరిజనుల సమస్యలపై స్పందించని అధికారులను ఇప్ప టికే బయట ప్రాంతాలకు పంపివేశామని ఐటీడీఏలో కూడా ఏరివేత తప్పదన్నారు. ఆదివాసీ నాయకుడు బిర్సాముండా జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పాల్గొని బిర్సా ముండా, కొమరం భీమ్, డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదివాసీ మహనీయుల వి గ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏలో ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం లేదని, అనేక మంది తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. పని చేయని అధికారులు సర్దుకోవాలన్నారు. ఐటీడీఏ డీడీ జగన్నాథరావు, ఏపీవో శ్రీనివాసరావు, ఈఈ లత, డీవైఈవో రవికుమార్, శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

ద్వారకాతిరుమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం నిమిత్తం బైక్‌పై విజయవాడ నుంచి బైక్‌పై వస్తూ రాయవరపు వెంకట సాయి దుర్గా ప్రసాద్ మార్గమధ్యలో తన ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించారు. ఎస్.ఐ. సుధీర్ ఆధ్వర్యంలో ట్రేస్ చేయగా ఓ పశువుల కాపరికి దొరికినట్లు గుర్తించి దాన్ని తీసుకొచ్చి భక్తుడికి అప్పగించారు.

చింతలపూడి సబ్ జైలు తనిఖీ

చింతలపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్ జైలును మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్. మధుబాబు శనివారం తనిఖీ చేశారు. ఖైదీల కేసు వివరాలు, వారికి అందుతున్న ఆహారం, అనారోగ్యంతో ఉన్న వారికి అందుతున్న వైద్య సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో జైలు సూపరింటెండెంట్ కృపానందం, ప్యానల్ న్యాయవాదులు ఎల్.వి.చైతన్య, యేసు రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

బుట్టాయగూడెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విప్పలపాడు ఏకలవ్య మోడరన్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న తెల్లం భువన రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. భువనకు శనివారం విశాఖలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు భార్గవి చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. పీవో కె.రాములు నాయక్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కావాలి

భీమడోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):డ్రగ్ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎక్సైజ్ సీఐ ఎన్ కల్యాణి గ్రంథాలయ వారోత్సవాలు రెండవ రోజు భీమడోలు, గుండుగొలను, పూళ్ల గ్రంథాలయాల్లో ఘనంగా నిర్వహించారు. భీమడోలు గ్రంథాలయంలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను సీఐ వివరించారు. గ్రంథపాలకుడు శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్ఐలు శశిధర్, రామస్వామి, ఉపాధ్యాయులు మండే సుధాకర్, బాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

స.హ. చట్టం కార్యకర్తల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరురూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టం జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో సభ్యులుగా ఇద్దరు కార్యకర్తల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సమాచార హక్కు చట్టం నియమ, నిబంధనలు పూర్తిగా తెలిసి సమాచార హక్కు చట్టంపై అవగాహన, ఆసక్తి కలిగిన వ్యక్తులు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో ఏడాది పాటు సభ్యులుగా ఉండేందుకు తమ దరఖాస్తులను ప్రభుత్వ పని దినాల్లో ఈనెల 29వ తేదీలోగా ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని మెజిస్ట్రీరియల్ సెక్షన్‌కు అందేలా దరఖాస్తులు పంపాలన్నారు. నిర్ణీత దరఖాస్తు ఇతర సమాచారం కోసం హెచ్‌టిటిపి:// ఏలూరు.ఏపీ.జీవోవి.ఇన్/ఆర్టీఐ/ వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంటాయని, లేదా జిల్లా కలెక్టరేట్‌లోని మెజిస్ట్రీరియల్ సెక్షన్‌లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.


శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

ఆయుష్‌లో అరుదైన శస్త్రచికిత్స

ఏలూరుఅర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గాజు ముక్కలను మింగి ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓ మహిళకు ఏలూరు ఆయుష్ ఆసుపత్రి వైద్యులు అత్యవసర శస్త్ర చికిత్స చేసి కాపాడారు. ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి శనివారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ నగరానికి చెందిన ఓ మహిళ తన చేతికున్న ఐదు గాజులను ముక్కలుగా చేసి మింగింది. కడుపునొప్పి,వాంతులు, కడుపు ఉబ్బరం వంటి లక్షణాలతో పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను శుక్రవారం ఆయుష్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అత్యవసర విభాగంలో ఆమెను పరీక్షించిన ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు, హెపటోబిలియరీ అండ్ బేరి యాట్రిక్ సర్జన్ డాక్టర్ వేమూరి ప్రసన్నకుమార్ ఎక్స్‌రే తీయించగా, ఆసుపత్రి అనస్థీషియా నిపుణులు డాక్టర్ బాలమురళి, ఎండోస్కోపీ టీమ్ సమన్వయంతో మహిళ పెద్దపేగు నుంచి కొలనోస్కోపీద్వారా సురక్షితంగా తొలగించారు. చికిత్స విజయవంతమైందని, గాజు, లోహం, గట్టివస్తువులు మింగితే ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందని డాక్టర్ ప్రసన్నకుమార్ వివరించారు. ఆమె ఎందుకు మింగిందో తెలియరాలేదు.

కృష్ణారావుపాలెంలో 104 వైద్య శిబిరం

చాట్రాయి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెం పంచాయతీ కార్యాలయంలో శనివారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్‌సీడీసీడీ 4.0 సర్వే జరుగుతున్నదని, ఇందులో బీపీ షుగర్‌తో పాటు 3 రకాల క్యాన్సర్‌లకు స్క్రీనింగ్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే 17 నుంచి కుష్ఠు సర్వే ప్రారంభం అవుతుందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

కలిదిండి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండంగి, మట్టగుంట గ్రామాల్లో శనివారం హౌసింగ్‌పై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. హౌసింగ్ ఏఈఈ నాగబాబు మాట్లాడుతూ సొంత స్థలం కలిగిన లబ్ధిదారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నవంబరు 30వ తేదీలోగా ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఖాళీ స్థలాల్లో డిసెంబరు 31వ తేదీలోగా ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. కూటమి నాయకులు, అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా రవిచంద్ర

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళా పోలీ స్ స్టేషన్ డీఎస్పీగా యు.రవిచంద్ర శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరులో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టగా మహిళా ఎస్‌ఐ నాగమణి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీ యు. రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్‌శాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మహిళలపై జరిగే నేరాలపై వేగవంతమైన, పారదర్శకమైన విచారణ చేపడతామన్నారు. శక్తి టీమ్ సభ్యు లతో జిల్లాలోని అన్ని పాఠశాలలు, కాలేజీల వద్ద మహిళలు, బాలికలపై ఆకతాయిలు వేధింపులకు గురి చేయకుండా గట్టి గస్తీ నిర్వహిస్తామన్నారు.

బిర్సాముండాకు ఘన నివాళి

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా ధైర్య సాహసాలు ఎనలేనివని వక్తలు పేర్కొన్నారు. వడ్లమానులో బిర్సాముండా జయంతిని బీజేపీ మండల ఇన్‌చార్జి మాగంటి వాసు ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సంగా రంగారావు ఘనంగా నిర్వహించారు. బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కొవ్వలి బాబూరావు, మట్టా సూరిబాబు, జలసూత్రం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల సమస్య పరిష్కారం : కామినేని


రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

మండవల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే పాలనలో లంక గ్రామాలకు దీర్ఘకాలిక రహదారి సమస్య పరిష్కారమైందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని మణుగులూరు నుంచి పెనుమాకలంక ప్రధాన రహదారి నిర్మాణ పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పెనుమాకలంక, నందిగామకలంక, ఇంగిలిపాకలంక గ్రామాల ప్రజల ప్రధాన సమస్య రహదారి పనులను ప్రారంభించామని, ఇకపై ఈ గ్రామ ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన రహదారిని నిర్మిస్తున్నామని తెలిపారు. ఎన్డీయే నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చిన్నారుల్ని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి: డీఎస్పీ


ఉపాధ్యాయినికి అవార్డు ఇస్తున్న డీఎస్పీ

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూజివీడు బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్వీ ప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని జాతి భవిష్యత్తు బాగుండాలంటే చిన్నారులను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మీ ఎదుగుదలను చూసి సమాజం మీ తల్లితండ్రులను, మిమ్మల్ని గౌరవిస్తుందన్నారు. ఉపాధ్యాయిని రాధికకు బెస్ట్ టీచర్ అవార్డును డీఎస్పీ చేతుల మీదుగా అందించారు.

కృత్రిమ కాళ్లతో దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు హైటెక్ కృత్రిమ కాళ్ళు వారి భవిష్యత్తుకు భరోసానిస్తూ ఆత్మ విశ్వాసం పెంపొందిస్తున్నాయని గుంటూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ అన్నారు. శనివారం తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చావా రేణుశ్రీ, పొట్ల రామ్ మనోజ్, సంఘ సేవకులు చుండూరు మధుసూదనరావు ఆర్థిక సాయంతో ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 15 మందికి 17 కృత్రిమ కాళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది బాలలకు ఉచిత విద్యనందించడంతో పాటు, అంధ పాఠశాల నిర్వహిస్తూ వందలాది దివ్యాంగులకు అండగా నిలుస్తున్న హీల్ సంస్థ సేవలను ఆయన కొనియాడారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.



కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో కోటి దీపోత్సవం.. ఆనందేశ్వరస్వామి ఆలయంలో దీపాలను వెలిగించిన మహిళలు

ఘనంగా కోటి దీపోత్సవం

కైకలూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల సందర్భంగా కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో శనివారం కోటి దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 100 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ అధికారి వీఎన్‌కె శేఖర్ ఏర్పాట్లును పర్యవేక్షించారు. కూటమి నేతలు కేకే బాబు, బొల్లంపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఆనందేశ్వరస్వామి ఆలయంలో జ్యోతిర్లింగార్చన వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృ తాలతో అభిషేకాలు చేశారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి శివ లింగాకారంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు.

ముదినేపల్లి: కార్తీక ఏకాదశి సందర్భంగా అల్లూరు సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో దీపారాధనలు చేశారు. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్బరాయశర్మ స్వామికి పూజలు నిర్వహించారు. సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి, గురజలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు జరిగాయి. దేవపూడిలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నసమారాధన జరిగింది.


విశేష అలంకరణలో అల్లూరు సోమేశ్వరస్వామి

ఐక్యతను పెంచే వన సమారాధనలు

కార్తీక వనసమారాధనలు ఐక్యతను, ఆత్మీయతను పెంచుతాయని బీజేపీ ఏలూరు జిల్లా కో-కన్వీనర్ కోటప్రోలు కృష్ణారావు అన్నారు. ముదినేపల్లిలో శనివారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు. మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి అధ్యక్షతన కార్యక్రమం జరి గింది. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగ న్మోహనరావు, జనసేన నాయకుడు అబ్బిశెట్టి నాగబాబు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


సానారుద్రవరంలో అవగాహన ర్యాలీ


పెదగొన్నూరులో రోడ్ల వెంబడి పరిశుభ్రత


కొత్తగూడెం పాఠశాలలో చేతులు పరిశుభ్రత


ముసునూరులో ర్యాలీ

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

» స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో వక్తలు » అవగాహన ర్యాలీలు » శుభ్రతా కార్యక్రమాలు


ప్రతిజ్ఞ చేయిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న

చాట్రాయి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్య సమాజం, అభివృద్ధి సాధ్యమని అందరూ గుర్తించాలని నూజివీడు డివిజన్ అభివృద్ధి అధికారి, మండల స్పెషలాఫీసర్ వెంకటరత్నం, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొత్తగూడెంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయటం వలన అపరిశుభ్రత నెలకొని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని, తడి పొడి చెత్తను వేరువేరుగా డబ్బాలలో ఉంచి ఇంటి ముందుకు వచ్చే చెత్త బండిలో వేస్తే దాన్ని సంపద కేంద్రానికి తరలిస్తే ఎరువు తయారు చేస్తారని, తద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించా రు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, చేతుల శుభ్రం చేసుకునే విధానంపై సూచనలిచ్చారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు బాలికోన్నత పాఠశాలలో సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ పోటీలలో గెలుపొందిన బాలికలకు, మున్సిపల్ వర్కర్లకు బహుమతులు, కిట్స్ అందించారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ కె. వీరయ్య, హెచ్ఎం అనూరాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని నూజివీడు డీఎల్‌పీవో, మండల ప్రత్యేక అధికారిణి సుందరి, ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు, విద్యార్థులు గ్రామ పురవీధుల్లో అవగహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి, సంపద కేంద్రానికి తరలించి వర్మీకంపోస్ట్ తయారీ విధానంపై క్లాప్ మిత్రలకు అవగహన కల్పించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ నుంచి వచ్చిన కిట్లను నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి), పీఏసీఎస్ అధ్యక్షుడు దేవినేని శ్రీధర్, ఎంపీడీవోలు క్లాప్ మిత్రలకు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు, ఏపీఎం రాంబాబు, కార్యదర్శి డి.వెంకటేష్, వలసపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శనివారం సానారుద్రవరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. రహదారులపై, కాల్వల వెంబడి చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో రోడ్ల వెంబడి చెత్త తొలగింపు పనులు నిర్వహించారు. ముదినేపల్లిలో సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో ఎంపీడీవో వై రామకృష్ణ, చినపాలపర్రు, వడాలి, పూటుకూరు, గురజ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో డిప్యూటీ ఎంపీడీవో అశోక్, మండల పరిషత్తు కార్యాలయ ఏవో రమణారావు తదితరులు పాల్గొన్నారు. పెదగొన్నూరులో సర్పంచ్ తాడంకి శిరీష ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు జరిగాయి.

సిల్వర్ షాక్ !

(5వ పేజీ తరువాయి)

చైనా బార్, పూసల్ని లిక్విడ్ రూపంలో కొనుగోలు చేశారు. కొందరు స్టాక్ లేకపోవడంతో అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. అత్యధిక వ్యాపారం నరసాపురం, భీమవరం మార్కెట్‌ల్లో జరిగింది.

ఒక్కసారిగా పతనం

మార్కెట్ అంచనాలన్నీ గత నెల రెండో వారంలో పటాపంచలయ్యాయి. ఇజ్రా యిల్, పాలస్తీనా మధ్య ఒప్పందం, చైనా, అమెరికాల మధ్య వాణిజ్య ట్రేడ్‌పై ట్రంప్ సానుకూల ప్రకటనల ప్రభావం బులియన్ మార్కెట్‌పై పడింది. దీంతో అమ్మకాలు మొదలయ్యాయి. ఒకానొక దశలో ఒక్క రోజులోనే కేజీ వెండి రూ 10 వేలు పతనమైంది. దీన్ని చూసిన మదుపుదారులు కలవర పడ్డారు. రానున్న రోజుల్లో 2007, 2011 నాటి పరిస్థితులు వస్తాయన్న భయంతో కొన్న వెండిని ఆయినకాడికి అమ్మకాలు మొదలుపెట్టారు. అప్పట్లో పతనమైన వెండి మళ్లీ పెరుగుదలకు 14 ఏళ్లు పట్టింది. ఇంతకాలం పెట్టుబడి పెట్టి కూర్చుంటే వడ్డీ నష్టమని భావించి అయినకాడికి అమ్ముకుంటున్నారు. ఇటు వ్యాపారులు కూడా ధర తగ్గించి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రమాదం.. చెంతనే!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. రబ్బరు వస్తువులు, వైర్లు ఇలాంటివి స్టేషన్లలో ఉన్నాయి. ఇక స్టేషన్ రూముల్లో సీజ్ చేసిన మద్యం, పాన్‌పరాగ్, గుట్కా, గంజాయి వంటివి ఉన్నాయి. గతంలోనే ఒక రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి ఇలాంటి సీజ్ చేసిన అన్నింటిని ప్రత్యేకంగా ఒక యార్డులాంటిది ఏర్పాటు చేసి అక్కడ భద్రపరిస్తే ఎంతో సురక్షితమని భావించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినప్పటికీ బుట్టదాఖలైనట్లే తెలుస్తోంది.

ప్రస్తుతం పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాదపు అంచుల్లోనే తమ విధులను నిర్వర్తిస్తున్నారని భావించవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సమస్యలు పరిశీలించి అటు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు, ఇటు వివిధ సమస్యలతో న్యాయం కోసం వచ్చే ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞులు కోరుతున్నారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణగా తీసుకుని ఉమ్మడి జిల్లాలో ఉన్న పోలీస్ స్టేషన్లలోని అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వస్తువులు, ద్రవాలను వేరే ప్రాంతాల్లో భద్రపరచడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముందస్తు కార్యాచరణతోనే టెన్త్‌లో సత్ఫలితాలు

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల నిర్వహణకు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు ముందస్తు కార్యాచరణ రూపొందించుకో వాలని పాఠశాలల పరీక్షల విభాగం ఏలూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆశ సూచించారు. మండలంలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించి ఆయా హైస్కూళ్లలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనపై హెచ్ఎంలతో చర్చించారు. అవసరాలను గుర్తించి ముందుగానే అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత విద్యకు పదవ తరగతిలో సాధించిన ప్రతిభ పునాదిలాంటిదన్నారు.


వదాలి జడ్పీ హైస్కూలు పరిశీలనకు వచ్చిన పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆశ

ఎంఈవో -1 డి.రామారావు, హెచ్ఎంలు విజయకుమార్, ప్రభుదాసు, ఉదయ భాస్కర్, సిస్టర్ లిన్సా తదితరులు పాల్గొన్నారు.

72 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు

ఏలూరు క్రైం, న వంబరు 15 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీ అధికారులు ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివా రం ఉదయం వరకు ఏలూరు జిల్లా కలపర్రు టోల్‌గేట్, జంగారెడ్డిగూడెంలో ఆర్టీవో ఎస్‌బి శేఖర్, ఎస్ఎస్ రంగనాయకులు పర్యవేక్షణలో మోటారు వాహనాల తనిఖీ అధికారులు ప్రత్యేక బృందాలతో ప్రైవేటు ట్రావెల్ బస్సులను తనిఖీలు నిర్వహించారు. మొత్తం 72 బస్సులపై 72 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ చెప్పారు. ఈ బస్సులపై 7 లక్షల 65 వేల 230 రూపాయల అపరాధ రుసుము విధించగా అప్పటికప్పుడే నాలుగు లక్షల 50 వేల 100 రూపాయలు వసూలైనట్లు తెలిపారు. ధ్రువ పత్రాలు లేకపోవడం, అత్యవసర ద్వారం, అగ్ని మాపక పరికరాలు, పాసింజర్ లిస్టులేకపోవడం తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలు ప్రతి రోజు నిర్వహిస్తామని డీటీసీ షేక్ కరీమ్ చెప్పారు.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర బహిష్కరణ

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో పిలుపు మేరకు శనివారం ముదినేపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను బహిష్కరించారు. దీనికి సంబంధించిన యాప్‌లో కార్యక్రమాలను అప్‌లోడ్ చేయడం కూడా బహిష్కరించారు. బోధనేతర కార్యక్రమాలను బాయ్‌కట్ చేయాలన్న నిర్ణయం మేరకు కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు ఏపీటీఎఫ్ నాయకుడు బేతాళ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో రైళ్లకు తాత్కాలిక స్టాప్

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో 16 రైళ్ళకు తాత్కాలికంగా స్టాప్‌లను కల్పిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతిని పురస్కరించుకుని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ తగ్గించే దృష్ట్యా హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో కూడా 14 రోజుల పాటు రైళ్ళను ఆపడానికి చర్యలు తీసుకున్నట్లు తెలి పారు. వచ్చే ఏడాది జనవరి 7 నుంచి 25వ తేదీ వరకూ ఈ రైళ్ళకు స్టాప్ కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 12749 మచిలీపట్టణం - బీదర్, 17255 నర్సాపూర్ - లింగంపల్లి, 12737 కాకినాడ పోర్టు - లింగంపల్లి, 12806 లింగంపల్లి - విశాఖ, 12775 కాకినాడ టౌన్-లింగంపల్లి, 17207 సాయినగర్ శిర్డి-మచిలీపట్నం, 17205 సాయినగర్ షిర్డి-కాకినాడ పోర్టు, 18519 విశాఖ- ఎల్‌టిటి ముంబై, 17208 మచిలీపట్నం- సాయినగర్ షిర్డి, 17206 కాకినాడ పోర్టు- సాయినగర్ షిర్డి, 12805 విశాఖ - లింగంపల్లి, 18520 ఎల్‌టీటీ ముంబై - విశాఖ, 12738 లింగంపల్లి - కాకినాడ పోర్టు, 17256 లింగంపల్లి - నర్సాపూర్, 12750 బీదర్ - మచిలీపట్నం రైళ్లు ఆగుతాయి.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ముసునూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి పంటకు మద్దతు ధర పొందాలని టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్ర బాబు అన్నారు. చింతలవల్లి సొసైటీలోని కొనుగోలు కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన 20 టన్నుల ధాన్యం లోడు లారీకి జెండా ఊపి రైస్ మిల్లుకు పంపారు. కూటమి ప్రభుత్వం పంటలకు మద్దతు ధర కల్పించిందన్నారు.

అజ్ఞాతం వీడిన ఎంఈవో

ఏలూరు అర్బన్, నవంబరు 15(ఆంధ్ర జ్యోతి): అధికారిక సమాచారం, అనుమతులు లేకుండా ఈ ఏడాది సెప్టెంబరు 24 నుంచి విధులకు గైర్హాజరవుతున్న నూజివీడు ఎంఈవో-2 జమలయ్య శనివారం హఠాత్తుగా డీఈవో కార్యాలయానికి వచ్చారు. తనను విధుల్లో జాయిన్ చేసుకోవాల్సిందిగా డీఈవో వెంకట లక్ష్మమ్మను కలిసి అభ్యర్థించారు. రెండు నెలల పాటు అనధికార సెలవులో వున్న ఆయనకు కాకినాడ ఆర్జేడీ షోకాజ్ నోటీసు జారీ చేసిన విషయాన్ని డీఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. నోటీసుకు సమాధానం ఆర్జేడీకే ఇచ్చి జాయినింగ్ పర్మిషన్‌ను అక్కడి నుంచే తెచ్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేయడంతో ఆయన వెనుదిరిగారు. ఆయన అదృశ్యంపై పలు విషయాలు ప్రచారంలో ఉండగా, శనివారం డీఈవో కార్యాలయంలో ప్రత్యక్ష మవడంతో డైలమాకు తెరపడింది.



హరికథా గాన ఆరాధన ఉత్సవాలు

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిమి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ, ఆదిభట్ల నారాయణ దాసు, పెద్దింట సూర్యనారాయణ దీక్షిత దాసు హరికథ గాన కళకు త్రిమూర్తులుగా వారు చేసిన సేవలు అజరామరం అని వక్తలు కొనియాడారు. నూజివీడు తాడేపల్లి నాగరాజ నరసింహమూర్తి ఆధ్యాత్మిక వేదికలో హరికథ గాన త్రిమూర్తుల ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఆరాధన ఉత్సవాలలో ఈ సందర్భంగా హరికథ సమగ్ర పరిశీలనను చల్లా లక్ష్మీనరసింహమూర్తి వివరించగా సుగ్రీవ విజయం హరికథను హైద్రాబాద్‌కు చెందిన దాలపర్తి ఉమామహేశ్వరి ఆలపించారు. హరికథా ప్రజాదరణను దివి వరప్రసాద్ వివరించగా రుద్రాక్ష మహత్యాన్ని సినీ నటి పడాల కల్యాణి వివరించారు.

క్రైమ్ కార్నర్

చోరీ కేసులో హిజ్రా అరెస్టు

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త ఈదరలో ఇటీవల జరిగిన చోరీ కేసులో షేక్ మున్నా అలియాస్ (సిరి) అనే హిజ్రాను అరెస్టు చేసి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. ఈ నెల 3న కొత్త ఈదరలోని బెక్కం పెద్ద సీత ఇంట్లో బంగారం చోరీ కావడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న హిజ్రాను అదుపులోకి తీసుకొని విచారించి నాలుగు బంగారు ఉంగరాలు, చెవి దిద్దులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏలూరుకు చెందిన ఈ హిజ్రాపై 22 కేసులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. సారా స్వాధీనం

ముసునూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడిలో సారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు చేశారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణికుమార్, సిబ్బంది దాడులు జరిపిన దాడుల్లో లోపూడి అడవిలో సారా తయారు చేస్తున్న బోట్ల కనకరావును అదుపులోకి తీసుకుని అతని నుంచి 5 లీటర్ల సారా, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. సారా తయారీకి చింతలపూడికి చెందిన వజ్రపు సీత మహేశ్వరరావు అనే వ్యక్తి బెల్లం సరఫరా చేసినట్టు విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో సారా తయారు చేసినా, విక్రయించినా, బెల్ట్‌షాపులు నడుపుతున్నా వెంటనే 94409 02462 కు సమాచారం ఇవ్వాలని, పేర్లను గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

ఆగిరిపల్లి: ఈదర గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నూజివీడు ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్య సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. ఎస్ఎ పేటకు చెందిన వల్లెపు తిరుపతిరావును అదుపులోకి తీసుకొని అతని నుంచి 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బెల్లం సరఫరా చేసిన నెక్కలం గొల్లగూడేనికి చెందిన మాటూరి మురళీమోహన రావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సారా విక్రయిస్తున్న ఈదరకు చెందిన ఆరేపల్లి సాంబ శివ రావుపై కేసు నమోదు చేసినట్లు మస్తానయ్య తెలిపారు.


కైకలూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం



నూజివీడు, ఆగిరిపల్లి గ్రంథాలయాల్లో ప్రారంభమైన పుస్తక ప్రదర్శనలు

పుస్తక పఠనంతో విజ్ఞానం

కైకలూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుండే గ్రంథ పఠనం అలవరుచుకోవాలని న్యాయవాది రుద్రపాక రత్నారావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం కైకలూరు శాఖా గ్రంథాలయంలో కైకలూరు కొత్తపేట ఉర్దూ పాఠశాల విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. హెచ్ఎం ఎం. హసన్, గ్రంథాలయాధికారి వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో అనిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉన్నత స్థితికి చేరుకున్న వారుందరు పుస్తక పఠనం అభిరుచి ఉన్న వారన్నారు. కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్‌బాబు, రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: పుస్తక పఠనం దైనందిన జీవితంలో భాగం కావాలని ముదినేపల్లి తహసీల్దార్ లతీఫ్ పాషా అన్నారు. శనివారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాలల్లో కూడా పుస్తకాలు చదివించటం, వాటిని విశ్లేషించటం విద్యార్థులకు అలవాటు చేయాలన్నారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి, స్కూల్ ప్రిన్సిపల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో తహసీల్దార్, ఎంపిడివో మొక్కలను నాటారు.

చాట్రాయి: పుస్తక పఠనంతో అద్భుతాలు సాధించవచ్చునని ఎంఈవో-2 వీఎస్వీ బ్రహ్మాచారి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చనుబండ శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో గొప్ప వ్యక్తులంతా పుస్తకం పఠనం వల్లే ఆ స్థాయికి ఎదిగారని, విజ్ఞానం ఉన్న వ్యక్తులు ఏ రంగంలో అయినా జనాదరణ పొందుతారని ఉద్బోధించారు. హెచ్ఎంలు రవీంద్రనాథ్, రవికుమార్, సచివాలయ ఉద్యోగులు మురళీమోహన్, లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు జిల్లా ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను ఎస్ఆర్ఆర్ బాయ్స్ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం పుష్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ చూపాలని, నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాస్, యశ్వంత్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య, శిఖ ఆకాష్, రిటైర్డ్ దేవదాయ ధర్మదాయశాఖ ఈవో రాజా రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. గోపవరం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని ఉపాధ్యాయుడు కొప్పుల బాబూరావు అన్నారు. అనంతరం గ్రంథాలయ అధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను ఆగిరిపల్లి ఎంపీపీ స్కూల్ హెచ్ఎం వేణుగోపాల్‌రావు ప్రారంభించారు. నేటి చరిత్ర భావితరాలకు అందించే ఒక అద్భుతమైన రూపమే పుస్తకం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర, కథల పుస్తకాలు ప్రదర్శించారు. గ్రంథాలయం అధికారి కుమార్ పాల్గొన్నారు.